FLASH EDITION
WWW.AMMADAILY.COM
EVENING 5PM
AMMA NEWS డిజిటల్
శుక్రవారం
5 జూలై 2024



# రేవంత్ సూపర్ 6



## అర్ధరాత్రి కాంగ్రెస్‌లోకి ఆరుగురు ఎమ్మెల్సీలు

లైన్ లో మరో ఆరుగురు.. ఇప్పటికే చేరిన ఆరుగురు ఎమ్మెల్యేలు

మరో ఆరుగురు ఎమ్మెల్యేలు రెడీ.. కేసీఆర్ సెంటిమెంట్ సిక్స్‌తోనే సిక్సర్లు కొడుతున్న సీఎం

సీఎం రేవంత్ కేసీఆర్ సెంటిమెంట్ లక్కీ నెంబర్ 6తోటే సిక్సర్ల మోత మోగిస్తున్నారు. ఇప్పటిదాకా బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేల సంఖ్య ఆరు. బుధవారం అర్ధరాత్రి ఒకేసారి చేరిన ఎమ్మెల్సీల సంఖ్య ఆరు. ఇంకా లైన్ లో ఉన్న ఎమ్మెల్సీల సంఖ్య 6. రేపో మాపో అంటూ చేరేందుకు రెడీ అవుతున్న ఎమ్మెల్యేల సంఖ్య 6. దీంతో ఆరు ఆరు నెంబర్ అధినేత కేసీఆర్ చెవుల్లో ప్రతిధ్వనిస్తుండగా, సూపర్ సిక్స్‌లతో కేసీఆర్‌కు, బిఆర్ఎస్ కు షాకిస్తున్నారు.

అమ్మన్యూస్ – హైదరాబాద్

2లో



## నౌ మీట్ టైమ్

- రేపే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ
- నూతన శకం మొదలైనట్టేనా

3లో



## కేసీఆర్‌కు గ్రేటర్ షాక్!

- మీటింగ్‌కు 8 మంది ఎమ్మెల్యేలు డుమ్మా
- 17 మంది నగర కార్పొరేటర్లు సైతం దూరం
- అయోమయంలో గులాబీ దళపతి

2లో



## పని చేసిన వారికి గుర్తింపు

చేరికలపై ఆందోళన అనవసరం

దేశవ్యాప్తంగా పార్టీ మరింత బలపడుతుంది

అమ్మన్యూస్ తో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ 2లో

# కేసీఆర్‌కు గ్రేటర్ షాక్!

- మీటింగ్‌కు 8 మంది ఎమ్మెల్యేలు డుమ్మా
- 17 మంది నగర కార్పొరేటర్లు సైతం దూరం
- అయోమయంలో గులాబీ దళపతి
- బోసిపోయిన తెలంగాణ భవన్
- రాష్ట్రంలో హాట్‌హాట్ చర్చ




**(అమ్మన్యూస్, హైదరాబాద్):** గులాబీ దళపతి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు 'గ్రేటర్' షాక్ తగిలింది. మొన్నటి వరకు ఎమ్మెల్యేలు వరుసగా పార్టీకి గుడ్ బై చెప్పగా నిన్న ఒకే దఫాలో ఆరుగురు ఎమ్మెల్సీలు గులాబీ పార్టీని వీడి కేసీఆర్‌కు షాక్ ఇచ్చారు. అది మరవక ముందే మరో బిగ్ షాక్ తగిలింది. తెలంగాణ భవన్‌లో శుక్రవారం అధిష్టానం నిర్వహించిన సమావేశానికి ఏకంగా ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, 17 మంది నగర కార్పొరేటర్లు డుమ్మా కొట్టారు. దీంతో పార్టీలో అంతా అయోమయంగా మారింది. పార్టీలో కొనసాగే వారెవరో, వీడే వారెవరో ఎవరికీ అంతు చిక్కడం లేదు. చేరికలు ఇంతటితో ఆగలేదని త్వరలోనే మరికొంత మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమతో చేతులు కలపడం ఖాయం అని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్న వేళ గులాబీ అధిష్టానం ఆహ్వానించిన మీటింగ్ కు సొంత పార్టీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు హాజరుకాకపోవడం సర్వత్రా చర్చకు దారితీస్తోంది. దీంతో కారు పార్టీలో ఏం జరుగుతుందో తెలియక క్యాడర్ డైలామాలో పడినట్లు తెలుస్తోంది.

### కీలక నిర్ణయం వేళ ..

శనివారం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం జరగబోతున్నది. ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి రాజీనామా కోసం పట్టుబట్టాలని అధిష్టానం భావిస్తోంది. ఇందులో భాగంగా రేపటి కౌన్సిల్ భేటీలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు రావాల్సిందిగా గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు గులాబీ పార్టీ పెద్దలు సమాచార అందించారు. అధిష్టానం నుంచి పిలుపు వచ్చినప్పటికీ అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కూకట్ పల్లి ఎమ్మెల్యే, మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, పాటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలు గైర్హాజరు అయినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అలాగే బీఆర్ఎస్ కు 47 మంది ఉన్న కార్పొరేటర్లు ఉండగా కేవలం 30 మంది మాత్రమే హాజరయ్యారు. నిజానికి ఈ సమావేశానికి కేటీఆర్ నేతృత్వం వహిస్తారని తొలుత ప్రచారం జరిగింది. అయితే కేటీఆర్, హరీశ్ రావులు ఢిల్లీలో కవిత బెయిల్ పిటిషన్ విషయంలో సీనియర్ అడ్వకేట్స్ తో మంతనాలు జరుపుతున్నారు. దాంతో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం కొనసాగింది.

### బీఆర్ఎస్‌ను వీడుతున్న మరికొందరు..

త్వరలోనే బీఆర్ఎస్ వదిలి అధికార పార్టీలోకి మారేందుకు సిద్ధంగా ఉన్నారనే టాక్ పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన మీటింగ్ కు ఎమ్మెల్యేలు దూరంగా ఉండటంతో రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకోబుతున్నాయనేది ఇంట్రెస్టింగ్ గా మారింది.

# రేవంత్ సూపర్ 6

## అర్ధరాత్రి కాంగ్రెస్‌లోకి ఆరుగురు ఎమ్మెల్సీలు

### లైన్ లో మరో ఆరుగురు

### ఇప్పటికే చేరిన ఆరుగురు ఎమ్మెల్యేలు

### మరో ఆరుగురు ఎమ్మెల్యేలు రెడీ

### కేసీఆర్ సెంటిమెంట్ సిక్స్ తోనే సిక్సర్లు కొడుతున్న సీఎం



**(అమ్మన్యూస్ - హైదరాబాద్ ):** సీఎం రేవంత్ కేసీఆర్ సెంటిమెంట్ లక్కీ నెంబర్ 6తోటే సిక్సర్ల మోత మోగిస్తున్నారు. ఇప్పటిదాకా బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేల సంఖ్య ఆరు. బుధవారం అర్ధరాత్రి ఒకేసారి చేరిన ఎమ్మెల్సీల సంఖ్య ఆరు. ఇంకా లైన్ లో ఉన్న ఎమ్మెల్సీల సంఖ్య 6. రేపో మాపో అంటూ చేరేందుకు రెడీ అవుతున్న ఎమ్మెల్యేల సంఖ్య 6. దీంతో ఆరు ఆరు నెంబర్ అధినేత కేసీఆర్ చెవుల్లో ప్రతిధ్వనిస్తుండగా, సూపర్ సిక్స్ లతో కేసీఆర్ కు, బిఆర్ఎస్ కు షాకిస్తున్నారు. మండలిలో ఆధిక్యం సాధించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి రచించిన వ్యూహాలు ఫలిస్తున్నాయి. తాజాగా జరిగిన ఎమ్మెల్సీల చేరికలతో కాంగ్రెస్ బలం 12కు పెరగగా.. మరో 6 గురిని చేర్చుకుని మండలిలో మెజారిటీ సాధించాలన్నది రేవంత్ ప్లాన్ గా తెలుస్తోంది. తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్ లోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఎప్పుడు ఏ ఎమ్మెల్యే, ఏ ఎమ్మెల్సీ హస్తం గూటికి చేరుతారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.కేసీఆర్ కు అత్యంత నమ్మకంగా ఉన్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోవడం గులాబీ పార్టీలో గుబులు పుట్టిస్తోంది. ఈ క్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా కాంగ్రెస్ లో చేరిపోయారు. నిన్న రాత్రి ఏకంగా ఆరుగురు ఎమ్మెల్సీలు ఒకేసారి కాంగ్రెస్ లోకి జంప్ కావడంతో బీఆర్ఎస్ కు బిగ్ షాక్ తగిలింది. బస్వరాజు సారయ్య, భాను ప్రకాశ్, ప్రభాకర్‌రావు, దండే విఠల్, దయానంద్, ఎగ్గే మల్లేశం సైలెంట్ గా రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ ఊహించని పరిణామంతో బీఆర్ఎస్ లో అలజడి మొదలైంది. కాంగ్రెస్ పార్టీతో ఇంకా ఎవరెవరు టచ్ లో ఉన్నారనే వివరాలను సేకరించే పనిలో బీఆర్ ఎస్ నాయకత్వం నిమగ్నమైంది. గురువారం గ్రేటర్ ఎమ్మెల్యేలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఎమ్మెల్సీల చేరికల కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, టిపిసిసి కార్యదర్శి సత్తు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లిలో ఉద్రిక్తత

## టీజీపీఎస్ సీ ముట్టడికి తరలివచ్చిన యువత

## అడ్డుకున్న పోలీసులు.. ఎక్కడికక్కడే అరెస్టులు

**అమ్మన్యూస్, హైదరాబాద్:** నాంపల్లి పరిసర ప్రాంతాలలో శుక్రవారం మధ్యాహ్నం వరకు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీడీపీఎస్ సీ ముట్టడికి నిరుద్యోగ జేఏసీ పిలుపు నివ్వడంతో పోలీసులు కార్యాలయ పరిసర ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకున్నారు. ఉదయ నుంచే నిరుద్యోగులు దఫదఫాలుగా టీజీపీఎస్సీ కార్యాలయం వద్దకు తరలి రావడంతో పరిసర ప్రాంతాలలోని ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శాంతియుత ముట్టడికి నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చినప్పటికీ పోలీసుల అరెస్టులు, యువకుల పెనుగులాట కారణంగా అక్కడ చిన్నపాటి యుద్ధ వాతావరణం నెలకొంది. గ్రూప్ 2,3 పోస్టులు పెంచి, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని నిరుద్యోగ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేసి, అక్టోబర్‌లో 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రూప్ 1లో 1:100ను అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు భారీగా మోహరించారు. విద్యార్థులను ఎక్కడిక్కడ అదుపులోకి తీసుకున్నారు. టీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీజేవైఎం కార్యకర్తలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన యువకులు, విద్యార్థి సంఘాల నేతలను శివార్లలోని వేర్వేరు పోలీసుస్టేషన్లకు తరలించారు.

### హామీలు ఇచ్చి, మాట తప్పిన కాంగ్రెస్: హరీష్ రావు

కాగా నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. హామీలు ఇచ్చి, మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా, డిమాండ్ల సాధనే లక్ష్యంగా టీజీపీఎస్సీ వద్ద శాంతియుత నిరసన తెలియజేసేందుకు వెళ్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. సోకాల్డ్ ప్రజాపాలనలో శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు కూడా నిరుద్యోగులకు లేదా? అని ప్రశ్నించారు హరీష్ రావు. తమ గోసను రిప్రజెంటేషన్ ద్వారా చెప్పుకునే అవకాశం కూడా లేదా అని నిలదీశారు. ఒక వైపు ప్రజా పాలన అని ప్రచారం చేసుకుంటూ. నిరుద్యోగుల గొంతులను, హక్కులను అణగదొక్కే కుట్రలకు రేవంత్ సర్కారు పాల్పడుతోందని ఆరోపించారు.


ఇది ముమ్మాటికీ ప్రజాపాలన కాదని 'అప్రజాస్వామ్యపాలన' అని ఉద్యోగాల కోసం పుస్తకాలు పట్టుకొని చదవాల్సిన విద్యార్థులను నడిరోడ్డుకు ఈడ్చి ధర్నాలు, ఆందోళనలు చేసే దుస్థికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని హరీష్ రావు విమర్శించారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖం తిప్పుకుంటే విద్యార్థులకు నిరుద్యోగులకు తోడు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు.. డిమాండ్లు సాధించే దాకా.. వదిలిపెట్టమన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల తరుపున గొంతెత్తుతామని, నిర్విరామ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, నిరుద్యోగుల అరెస్టులను తక్షణం నిలిపివేయాలని, నిర్బంధించిన వారిని, అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు అన్నారు.

# పని చేసిన వారికి గుర్తింపు ఖాయం

### చేరికలపై ఆందోళన అనవసరం

### దేశవ్యాప్తంగా పార్టీ మరింత బలపడుతుంది

### అమ్మన్యూస్ తో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్



**అమ్మన్యూస్, హైదరాబాద్ :** కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ జండా మోసిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ లో చేరికలు జోరందుకున్న తరుణంలో పార్టీలోని సీనియర్లు, మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారు కొంత మంది ఆందోళన వ్యక్తం చేస్తున్న అంశంపై అమ్మన్యూస్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనిల్ కుమార్ స్పందించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని, చేరికలనేవి నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. అంత మాత్రానా పార్టీ కోసం కష్టపడ్డ వారిని పార్టీ నిర్లక్ష్యం చేస్తుందనుకోవడం సరైంది కాదన్నారు. చేరికలపై ఎవరినీ వత్తిడి చేయడం లేదని, కేసీఆర్ నుంచి విముక్తి కోసమే వారంతా క్యూకట్టి కాంగ్రెస్ లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేరినంత మాత్రాన స్థానిక నాయకత్వానికి ఎలాంటి ఇబ్బంది రాకుండా పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. క్యాబినెట్ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక అంశాలను అధిష్టానం చూసుకుం టుందని, విస్తరణపై పార్టీలో ఎలాంటి భేదాభి ప్రాయాలు లేవన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గంతో పాటు మంత్రివర్గంలో యాదవ సామాజిక వర్గానికి కూడా చోటు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువతను ప్రోత్సహించాలని కాంగ్రెస్ భావిస్తుందని, యువరక్తంతో కాంగ్రెస్ ఉరకలు వేస్తుందన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో రాబోయే రోజుల్లో పార్టీ దేశవ్యాప్తంగా మరింత బలోపేతం కావడం ఖాయమన్నారు. ఎవరి సామర్థ్యం ఏమిటి, వారి సేవలను ఎక్కడ వినియోగించుకుంటే పార్టీకి ఉపయోగకరంగా ఉంటుందన్న విషయాన్ని అధిష్టానం ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుని పదవులను కట్టబెడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీయే లేదని జోరుగా ప్రచారం చేసిన పార్టీలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని చూసి ఈర్శ్య చెందుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలందరూ ఏకతాటిపై పయనిస్తున్నారని, పీసీసీ చీఫ్ గా ఎవరిని నియమించినా అందరూ కలిసి పని చేస్తారన్నారు.

# నౌ మీట్ టైమ్

## రేపే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ




**అమ్మన్యూస్ హైదరాబాద్:** ఆంధ్ర, తెలంగాణ, రెండు రాష్ట్రాల్లోనూ ఆసక్తి రేపుతున్న అంశం ఏదైనా ఉందంటే అది ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశమే. అటు చంద్రబాబు నాయుడు గురించి అందరికీ తెలుసు. అలాగే రేవంత్ రెడ్డి గురించి కూడా ఎవరికీ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ ఇద్దరి మధ్య ఉన్న గాఢానుబంధం కూడా తెలియందేం కాదు. ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రితో భేటీ అయ్యేందుకు ఉత్సాహం చూపుతూ.. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు లేఖ రాయడం అందుకు రేవంత్ రెడ్డి వైపు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడం చకచకా జరిగిపోయాయి.

### చర్చించే అంశాలేంటి..?

ఆంధ్రా – తెలంగాణ రాష్ట్రాల మధ్య ఒక అసాధారణమైన సమావేశం చోటు చేసుకోబోతోంది. వ్యక్తిగతంగా ఎంతో చనువున్న ఇద్దరు ముఖ్య మంత్రులు 6,వ తేదీన హైదరాబాద్ లో సమావేశం అవుతున్నారు.

వారిద్దరూ వ్యక్తిగతంగా కలుసుకోవడంలో పెద్ద చెప్పుకోదగ్గ అంశాలేమీ లేకపోయినా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా కలుసుకోవడమే ఆసక్తి రేపుతోంది.

ఏపీ నుంచి చంద్రబాబునాయుడు, తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రుల హోదాలో కలుసు కోబోతుం డడంతో రెండు రాష్ట్రాల మధ్య నలుగుతున్న అనేక సమస్యలు ఇక కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తు న్నాయి.

ముఖ్యంగా రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల వాటాల పంపిణీతో పాటు గోదావరి, కృష్ణా జలాలే కీలకంగా మారుతున్నాయి. అయితే పలు సంస్థల ఆధ్వర్యంలో ఉన్న ఆస్తుల పంపిణీ ఈపాటికే జరిగి ఉండేదని ఏపీ ముఖ్యమంత్రులు మొండిపట్టుదలకు పోయి విషయాలను జటిలం చేస్తున్నారన్న వ్యాఖ్యలు ఉన్నాయి.

అయితే ఇటీవల చంద్ర బాబునాయుడు ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక తాను భేషజాలకు పోబోవడం లేదని రెండు రాష్ట్రాల మధ్య నలుగుతు న్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని చెప్పడం విశేషం. తన ముందున్న లక్ష్యాల్లో అమరావతి రాజధాని నిర్మాణంతోపాటు పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్టును పూర్తి చేయడమేనని చెప్పడం కొసమెరుపు. మరోవైపు బహుశా ఇలాంటి అనేక అంశాలు దృష్టిలో ఉంచుకునే చంద్రబాబు స్వయంగా రేవంత్ కు లేఖ రాసి ఉంటారని తెలుస్తుంది. ఈ నేపథ్యంలోనే ఈసారి రెండు రాష్ట్రాలు సమస్యల పై శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తాయన్న అం చనాలు పెరుగుతున్నాయి.

# శివార్లలో సినీ తరహా ఛేజింగ్

- కాల్పుల కలకలం
- కత్తులతో రెచ్చిపోయిన పార్థి గ్యాంగ్
- చుట్టుముట్టిన పోలీసు టీంలు
- నలుగురిని అరెస్టు చేసిన నల్గొండ పోలీసులు

**అమ్మన్యూస్, హైదరాబాద్ :** హైదరాబాద్ శివారు పెద్ద అంబర్‌పేట సమీపంలో కాల్పులు కలకలం రేపాయి. ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర దోపిడీలకు పాల్పడుతున్న పార్థి గ్యాంగ్‌ను ఛేజ్ చేసిన పోలీసులు వారిని పట్టుకునే క్రమంలో గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ గ్యాంగ్‌లోని వాళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పార్థి గ్యాంగ్ కొంతకాలంగా జాతీయ రహదారిపై పార్కింగ్ వాహనాలను టార్గెట్ చేస్తోంది. వరుస దొంగతనాలతో నల్గొండ జిల్లా పోలీసులు నిఘా పెంచారు. దీంతో ఎస్పీ శరత్ స్పెషల్ టీమ్‌లను రంగంలోకి దించారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున హైవేపై ఈ దొంగల ముఠా పెట్రోలింగ్ పోలీసుల కంటపడింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించారు. ఇలా ఆ గ్యాంగ్‌ను వెంటాడుతూ వస్తూ రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి వచ్చాక స్థానిక పోలీసుల్ని అప్రమత్తం చేశారు. పార్థి గ్యాంగ్‌లో దొంగలను పట్టుకునేందుకు రాచకొండ, నల్గొండ పోలీసులు కలిసి వారిని వెంబడించారు. ఆ దొంగల ముఠాను వెంటాడుతూ పెద్దఅంబర్‌పేట సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరకు రాగానే దొంగలు కత్తులతో పోలీసులపై ఎదురు దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు గాల్లోకి రెండు రౌండ్‌లు కాల్పులు జరిపారు. ఆ తర్వాత ఈ దొంగల ముఠాలోని వారిని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే వారిని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంకా ఈ గ్యాంగ్‌లో ఉన్నవారిని పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల హైదరాబాద్ చిలకలగూడలో మొబైల్ ఫోన్ స్నాచర్లపై, సైదాబాద్‌లో చైన్ స్నాచర్లను పట్టుకునే క్రమంలో పోలీసులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. తాజాగా ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో కాల్పులు జరిగాయి. కొంతకాలంగా ఈ పార్థి గ్యాంగ్ పేరు బాగా వినిపిస్తోంది. ఈ గ్యాంగ్ వరుసగా చోరీలకు తెగబడుతోంది.. దీంతో పోలీసులు నిఘా పెంచారు.. వీరిపై ఫోకస్ పెట్టారు. ఇటీవల హైవేపై చోరీలు చేస్తున్నట్లు గుర్తించి.. వారిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా టీమ్‌లను రంగంలోకి దించారు. ఈ క్రమంలోనే ఆ గ్యాంగ్ చోరీ చేసి పారిపోతున్న సమయంలో పోలీసుల కంటపడ్డారు. వారిని పట్టుకునే ప్రయత్నంలో ఇదంతా జరిగింది.



# బీఆర్ఎస్‌లో భారీ కుదుపు

## అర్ధరాత్రి వేళ కేసీఆర్‌కు బిగ్ ఝలక్

- కాంగ్రెస్‌లోకి ఏకంగా ఆరుగురు ఎమ్మెల్సీలు..
- చేరిన వారిలో భాను ప్రసాద్, బస్వరాజ్ సారయ్య,
- దండె విఠల్, ఎం.ఎస్. ప్రభాకర్, యెగ్గె మల్లేశం, బుగ్గారపు దయానంద్..
- ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు చేరిక
- ఎమ్మెల్సీల చేరికతో మండలిలో పెరిగిన హస్తం బలం
- రోజురోజుకు బలహీనపడుతున్న గులాబీ దళం

**(అమ్మన్యూస్, హైదరాబాద్):** బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారుతోంది. పార్టీని వీడుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు చేరగా, తాజాగా ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం అర్ధరాత్రి వేళ కేసీఆర్‌కు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు భారీ ఝలక్ ఇచ్చారు. మరోవైపు పార్టీని కాపాడుకునేందుకు కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో క్యాడర్ డీలా పడిపోతోంది.

గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో డీలాపడ్డ కేసీఆర్‌కు.. నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు బీఆర్ఎస్ విలవిల్లాడుతోంది. కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ వలసల పరంపర కొనసాగుతోంది. తాజాగా, బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్సీలు భాను ప్రసాద్, బస్వరాజ్ సారయ్య, దండె విఠల్, ఎం.ఎస్. ప్రభాకర్, యెగ్గె మల్లేశం, బుగ్గారపు దయానంద్ కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి రాగానే.. అర్ధరాత్రి ఆయన నివాసంలో వారంతా కాంగ్రెస్ పార్టీలో చేరడం గమనార్హం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు. దండే విఠల్ ఆదిలాబాద్ లోకల్ బాడీ, భాను ప్రసాద్ కరీంనగర్ లోకల్ బాడీ, ఎమ్మెస్ ప్రభాకర్ రంగారెడ్డి జిల్లా లోకల్ బాడీ.. బొగ్గవరపు దయానంద్ గవర్నర్ కోటా, ఎగ్గే మల్లేషం, ఎమ్మెల్యే కోటా, బస్వరాజ్ సారయ్య గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. శుక్రవారం అమావాస్య కావడంతో గురువారం రాత్రే వీళ్లు కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలుస్తోంది. వీరి చేరికతో మండలిలో కాంగ్రెస్ బలం 12కు చేరింది.

### మరికొందరు కూడా..

ఇటీవలే మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరినట్లు అయింది. మరికొందరు కూడా బీఆర్ఎస్‌ను వీడుతారనే ప్రచారం జరుగుతోంది.


### నేడో, రేపో 'బండ్ల'..

మహబూబ్‌నగర్‌కు చెందిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఆయన నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తల అభిప్రాయం మేరకు తన నిర్ణయం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీ మార్పుపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, కార్యకర్తల అభిప్రాయంతో చేరికపై నిర్ణయం తీసుకుంటానని బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. సీనియర్ నేత కే కేశవరావు కూడా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే.

# మల్లన్నకు మరో భారీ షాక్

## మల్లారెడ్డి వర్సిటీలపై చర్యలకు హైకోర్టు ఆదేశం

**(అమ్మన్యూస్, హైదరాబాద్):** ఇప్పటికే భూ కబ్జా కేసులతో సతమతమవుతున్న మాజీ మంత్రి మల్లారెడ్డికి మరో భారీ షాక్ తగిలింది. ఎలాంటి అనుమతులు లేకుండా నగర శివారు ప్రాంతాలైన దూలపల్లిలో మల్లారెడ్డి యూనివర్సిటీ, బాలానగర్ లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కామర్స్ అండ్ డిజైన్ క్యాంపస్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ యూజీసీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాగా, నిబంధనలకు విరుద్ధంగా ఆ రెండు క్యాంపస్‌లను ఏర్పాటు చేశారంటూ నవీన ఎడ్యుకేషన్ సొసైటీ ఇటీవలే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన రాష్ట్ర అత్యున్నత ధర్మాసనం వర్సిటీలపై చర్యలకు ఆదేశించింది. అయితే, కేసు విచారణను తిరిగి జూలై 24కు వాయిదా వేసింది. ఒకవేళ మల్లారెడ్డి స్థాపించిన వర్సిటీలు అక్రమం అని



తేలితే క్యాంపస్‌లను శాశ్వతంగా క్లోజ్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

# ట్యాపింగ్ కేసులో ట్విస్ట్

**అమ్మన్యూస్, హైదరాబాద్ :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కేసు ఊహించని మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు ప్రస్తుతం విదేశాల్లో ఉన్న విషయం తెలిసిందే. అయితే, తాను ఇప్పట్లో హైదరాబాద్‌కు తిరిగి రాలేనని ఆయన తేల్చిచెప్పాడు. ఇదే కేసులో ఇప్పటి వరకూ నలుగుర్ని అరెస్ట్ చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వారు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా తదుపరి విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసులో ఇప్పటి వరకూ ఆశించిన మేర పురోగతి లేదు. ధ్వంసమైన కొన్ని ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. దీనికి కారణం ప్రధాన నిందితులైన ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు విదేశాల్లో ఉండటమే. వాస్తవానికి అధికారులు తమంత తాముగా అనుమతి ఇచ్చుకుని, ట్యాపింగ్ చేయడం ఎక్కడా జరగదు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కోసమే ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావుకు ఆ అధికారాన్ని కట్టబెట్టింది. అత్యవసర పరిస్థితుల్లో అనుమతి ఇవ్వొచ్చన్న చిన్న అవకాశాన్ని ఆసరాగా చేసుకుని ప్రభాకర్‌రావు అండ్ కో చెలరేగిపోయినట్టు సిట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నో సంచలనాలకు కేంద్ర బిందువుగా మారిన ఈ కేసు పురోగతి ప్రభాకర్‌రావు విదేశాల నుంచి తిరిగొస్తేనే సాధ్యమవుతుంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి రాకముందే ఆయన వైద్యం కోసం అమెరికాకు వెళ్లిపోయారు. అయితే, కేసు నమోదయిన తర్వాత తాను పారిపోలేదని, జూన్ 26 నాటికి తిరిగొచ్చి, దర్యాప్తునకు సహకరిస్తానని కోర్టులో ఆయన మెమో వేశారు. అయితే, చెప్పిన గడువు ముగిసిపోయినా తిరిగి రాని ఆయన చికిత్సకు మరికొన్ని రోజులు విదేశాల్లోనే ఉండాల్సి వస్తోందని మెయిల్ ద్వారా సిట్ అధికారులకు సమాచారం ఇచ్చారు.

# ముగిసిన జడ్పీ పాలక వర్గ పదవీకాలం

## స్పెషల్ ఆఫీసర్ గా జిల్లా కలెక్టర్ రాజర్షీ షా

- ఆదిలాబాద్ జడ్పీకి 65 ఏళ్లు
- 1959 లో జిల్లా పరిషత్ ఆవిర్భావం
- ఇప్పటివరకు సేవలందించిన 22 మంది చైర్మన్లు
- తొలి చైర్మన్ గా పల్సీకర్ రంగారావు
- ఉమ్మడి జిల్లా చివరి చైర్మన్ గా శోభారాణి



**అమ్మన్యూస్ ప్రతినిధి ఆదిలాబాద్ :** జిల్లా పరిషత్ ల పాలక వర్గ పదవీ కాలం నిన్నటితో ముగిసింది.మళ్లీ ఎన్నికలు జరిగి జడ్పీటీసీలు ఎన్నికై వారందరు చైర్మన్ ను ఎన్నుకొని తిరిగి జడ్పీ పాలక వర్గం కొలువు తీరేంతవరకు ప్రత్యేకాధికారి పాలన కొసాగనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఆనవాయితీగా జడ్పీ చైర్మన్ కున్న అన్ని అధికారాలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షీ షా ను స్పెషల్ ఆఫీసర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పట్లో ఎన్నికలు జరిగే సూచనలేవీ కనిపించికపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. జిల్లా పరిషత్ లు ఏర్పడినప్పటి నుండి ఇలా స్పెషల్ ఆఫీసర్ ల పర్యవేక్షణలో పాలన కొనసాగడం ఇది ఆరో సారి.

**ఎప్పుడెప్పుడంటే..**

జిల్లా పరిషత్ లు ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు ఐదుసార్లు ప్రత్యేకాధిరుల ఆధ్వర్యంలో పాలన కొనసాగింది. ఆవిర్భావం నుండి ప్రస్తుతం వరకు మొత్తం 13 సంవత్సరాల 3 నెలలపాటు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పాలన సాగింది. మొదటి సారి 1976లో జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారి గా పరి పాలన కొనసాగించారు. ఆ సమయంలో 1976 నుండి 1981 ఐదేళ్లపాటు వరకు స్పెషల్ ఆఫీసర్ పాలనే కొనసాగింది. రెండోసారి తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో 1986లో దాదాపు 11 నెలలపాటు కొనసాగింది. మూడోసారి 1992లోనూ కాంగ్రెస్ హయాంలో ప్రత్యేక అధికారిని నియమించి సుమారు మూడు సంవత్సరాలపాటు పాలన అమలు చేశారు. 2000 సంత్సరంలో తిరిగి తెలుగుదేశం ప్రభుత్వ అధికారంలో నాలుగోసారి మళ్లీ స్పెషల్ ఆఫీసర్ పాలన జరిగింది. అనంతరం సుమారు 14 నెలల పాటు జడ్పీ ఎన్నికలు జరగలేదు. ఇక 2011 లో అయిదోసారి కాంగ్రెస్ హయాంలో ప్రత్యేక అధికారి పాలన మూడేళ్లపాటు కొన సాగింది. అప్పట్లో ఎగిసి పడుతున్న తెలంగాణ ఉద్యమం కారణంగా ప్రభుత్వం ఆ టైమ్ లో ఎన్నికలు నిర్వహించలేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించారు ఇక తాజాగా జడ్పీ పాలకవర్గ గడువు ముగియడంతో ఆరోసారి స్పెషల్ ఆఫీసర్ పాలన కొనసాగనుంది. అయితే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, జిల్లాల విభజన అనంతరం ఇదే తొలి ప్రత్యేక పాలన కావడం విశేషం. దీంతో చైర్మన్ కుండే అధికారాలలో జిల్లా సమగ్రాభివృద్ధి కి ప్రణాళిక లు,నిధుల కేటాయింపు , పనుల ఎంపిక తదితర వ్యవహారాలన్నీజిల్లా కలెక్టరే చూసుకోవలసి ఉంటుంది.ఇందుకోసం ఇప్పటికే అన్ని జిల్లాలో అన్ని మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. మరి ఈసారి ఇది ఎన్ని నెలలు కొనసాగనుందో వేచి చూడాలి.

**జిల్లా పరిషత్‌కు 65 యేళ్లు**

ఇక్కడ జిల్లా పరిషత్ పాలకవర్గం తొలిసారి 1959 నవంబరు 29న కొలువు దీరింది. తొలి చైర్మన్ పల్సీకర్ రంగారావు పాలనలో జడ్పీ పాలన మొదలైంది. ఇప్పటి వరకు మొత్తం 22 మంది చైర్మన్లు ఆదిలాబాద్ జిల్లా పరిషత్ కు సేవలందించారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చివరి చైర్మన్ గా నిర్మల్ కు చెందిన వల్లకొండ శోభారాణి గుర్తింపు పొందితే రీసెంట్ గా ఇక్కడ జడ్పీ చైర్మన్ గా రాథోడ్ జనార్ధన్ పదవీ కాలం ముగిసింది.

# జడ్పీటీసీల పదవీకాలం పూర్తి

**జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట రెడ్డి కి సత్కారం**

**సన్మానించిన జడ్పీ చైర్మన్ , కలెక్టర్**

**ఐదేళ్ల పాటు సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపిన అరుంధతి వెంకట రెడ్డి**




**అమ్మన్యూస్ ప్రతినిధి ఆదిలాబాద్ :** జిల్లా పరిషత్ పాలకవర్గ సభ్యురాలిగా జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట రెడ్డి ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ లు శాలువాతో ఆమెను సత్కరించారు. జ్ఞాపికను బహుకరిస్తూ ప్రజలకు ఆమె చేసిన సేవలను కొనియాడారు.అనంతరం ఈ ఐదేళ్ల కాలంలో తనకు ప్రతీ పనిలో మద్దతుగా నిలిచి, తనను ఆదరించిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ,అధికారులకు మిత్రులు శ్రేయోభిలాషులకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు, అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు ,కుల సంఘాలకు ,యువజన సంఘాలకు ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి ,జడ్పీ సీఈవో రత్నమాల ,డిప్యూటీ సీఈఓ కళిందిని, మిషన్ భగీరథ ఎస్ఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేటెడ్‌పై నజర్..

- పదవులపై ఆశల చిగురింపు
- నేతల ప్రయత్నాలు ముమ్మరం
- అధిష్టాన పెద్దల చుట్టూ ప్రదక్షిణలు
- కసరత్తు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం
- నాయకుల పేర్లు సేకరించే పనిలో నిమగ్నం..!

అమ్మన్యూస్ ఆదిలాబాద్ ప్రతినిధి: నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించినట్టుగా తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల లోపే నియామకం చేపట్టే దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పార్టీ జెండాలు మోసిందేవరు..పార్టీ విధేయులు, గత ఎన్నికల్లో విజయం కోసం అహర్నిషలు శ్రమించినవారు ఎవరు..కష్టకాలంలో పార్టీని వీడకుండా అంటిపెట్టుకున్న నాయకుల వేటలో పడింది. వివరాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. దీంతో నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న పలువురు ఆశావహులు అధిష్టాన పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలే ఎన్నికల కోడ్ ముగియడంతో ఇప్పుడిప్పుడే పాలనపై దృష్టిసారించిన రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ హామీలను అమలు చేసే దిశగా పక్కా కార్యాచరణతో ముందుకుసాగుతోంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోంది. ఈ తరుణంలోనే ఆరు హామీలను నెరవేర్చడానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చింది. ఈ మేరకు కొన్ని హామీలను ప్రభుత్వం నెర వేర్చింది. ఈలోగా దేశవ్యాప్తంగా లోకసభ ఎన్నికలు, వివిధ రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు సుదీర్ఘంగా జరగ దంతో సుమారు మూడు మాసాలపాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడానికి వీలులేకుండా పోయింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి విశేష కృషి చేసిన నాయకులకు నామినేట్ పోస్టులు కట్టబెడతామని గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఆ పదవులపై ఆశలు చిగురిస్తున్నాయి. పలువురు ఆశావహులు పదవులను దక్కించుకోడానికి తహతహలాడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం పార్టీ కోసం కష్టపడినవారి పేర్లను సేకరించే పనిలో ఉంటే అటు నేతలు అధిష్టాన పెద్దల వద్ద లాబీయింగ్‌లు చేస్తున్నారు.

**ప్రయత్నాల్లో ఆశావహులు**


ఆదిలాబాద్ నియోజకవర్గంలో నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్నవారి సంఖ్య జరంత ఎక్కువగానే ఉంది. మార్కెట్ కమిటీ పోస్టులు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులు, దేవస్థానాల్లో నామినేటెడ్ పోస్టుల కోసం నాయకులు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న సీతక్క వద్దకు నాయకులు క్యూకడుతున్నట్టుగా సమాచారం అందుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి చెప్పినవారికే నామినేట్ పోస్టులు దక్కే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం అనేక మంది పోటీ పడుతున్నారు. డైరెక్టర్ల పోస్ట్ కోసం కూడా పోటీ ఎక్కువగానే ఉంది. మరోవైపు ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలోపే ఈ పోస్టులను భర్తీ చేయాలని ఆలోచన చేస్తున్న తరుణంలో ఆశావాహులు తమ ప్రయత్నాలను మరింత తీవ్రం చేస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో 10 సంవత్సరాలు పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో నిర్లక్ష్యం వహించడంతోనే అనేకమంది నాయకులు కార్యకర్తలు అసంతృప్తితో పార్టీ కోసం పనిచేయలేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అటువంటి తప్పిదాలు చేయకుండా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసి కష్టపడిన నాయకులను, కార్యకర్తలను సంతృప్తి పరచటానికి సమాలోచనలు చేస్తోంది. పదేళ్లుగా అధికారం లేకపోవడంతో నాయకులు, కార్యకర్తలు అనేక కష్టనష్టాలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో అభ్యర్థుల ఎంపిక కొంత కత్తిమీద సాములాంటిదే. కాంగ్రెస్ పార్టీలోని వివిధ అనుబంధ సంఘాలలో పనిచేసిన నాయకులు కూడా నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. అయితే ఎవరిని పదవులు వరిస్తాయో...ఎవరిని అధిష్టానం సంతృప్తి పరుస్తుందో వేచి చూడాల్సిందే. కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేక మంది నేతలు మార్కెట్ చైర్మన్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. రిజర్వేషన్ల మేరకు నేతలు ఎమ్మెల్యేలను, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసి తమకు పదవి ఇవ్వాలని కోరుతున్నారు. ఇటీవల మార్కెట్ కమిటీల పాలకవర్గంపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టత ఇవ్వడంతో ఆశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, చెన్నూరు, ఖానాపూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందగా మిగిలిన నియోజకవర్గాల్లో పార్టీ నేతలు సూచించిన పేర్లను నియోజకవర్గ ఇన్‌చార్జిలతోపాటు ఇన్‌చార్జి మంత్రి ప్రతిపాదించే అవకాశం ఉండటంతో స్థానిక నేతలతో కలిసి పదవులు దక్కించుకోవడానికి ఆశావహులు విశ్వ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు 18 ఉన్నాయి. నిర్మల్ జిల్లాలో నిర్మల్, సారంగాపూర్, కుభీర్, భైంసా, ఖానాపూర్ ఉండగా మంచిర్యాలలో జన్నారం, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, లక్సెట్టిపేట్ ఉన్నాయి. ఆసిఫాబాద్‌లో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, జైనూర్, ఆదిలాబాద్‌లో బోథ్, ఆదిలాబాద్, ఇచ్చోడ, జైనూరు, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటి ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, మార్కెట్ పన్నులు వసూలు చేస్తారు. కొత్త పాలకవర్గాలు ఏర్పడితే చాలామందికి రాజకీయ పదవులు దక్కనున్నాయి.

# కాంగ్రెస్‌ది ప్రజా పాలన

## అడ్డి భోజారెడ్డి



**అమ్మన్యూస్ ప్రతినిధి ఆదిలాబాద్ :** తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్యారెంటీ హామీలు నెరవేర్చి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందిందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో మీడియా తో మాట్లాడారు. ఇప్పటి వరకు ఏ రాష్ట్రం చేయని విధంగా ఏక కాలంలో రెండు లక్షల రుణ మాఫీ చేస్తున్న మొదటి ప్రభుత్వం తమ కాంగ్రెస్ సర్కార్ అన్నారు. అటు రైతు భరోసా కూడా ఎన్నిఎకరాలకు ఇవ్వాలి అని గ్రామ సభలు ద్వారా రైతుల అభిప్రాయాలమేరకు నిర్ణయిస్తుందన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు 2500 త్వరలో అమలు కానున్నావన్నారు. ఇక బీఆర్ఎస్ విమర్శలపై మాట్లాడుతూ దేవుడున్నాడని ఎవరు తీసిన గోతిలోవారే పడతారని బీఆర్ఎస్ తాను తీసిన గోతిలో తానే పడిందన్నారు. ఆనాడు ఫుల్ మెజార్టీ ఉన్నా కాంగ్రెప్ ఎమ్మెల్యేలను అంగట్లో సరుకులా కొనుగోలు చేసిందన్నారు. కాని ఇప్పుడు కేవలం రాష్ట్ర అభివృద్ధి ఆశించి మాత్రమే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీలో చేరుతున్నారని యెప్పారు. గతంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని కాబట్టి ఈసారి అభివృద్ధి చేసకుందామని పార్టీలో చేరుతున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు తన పదవికి రాజీనామా చేసి మరీ అదే ఉద్దేశంతో చేరారన్నారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని కేటీఆర్ కొత్తగా మాట్లాడుతున్నాడని మరి ఆనాడు మీ తండ్రి చేసింది ఏంటో సమాధానం చెప్పాలని అన్నారు.అలాగే కేంద్రంలో అధకారంలో ఉన్న బీజేపీ కూడా చేసిందేమీ లేదన్నారు. ఇక్కడి ప్రజల చిరకాల కోరికలైన టెక్స్ టైల్ పార్క్ , ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ , గిరిజన యూనివర్సిటీ ,సీసీఐ, ఎయిర్ పోర్ట లాంటి అంశాలు ఎప్పటినుండో పెండింగ్ లో ఉన్నాయన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నకేంద్రం ఏమి చేయలేక పోయిందని నెపాన్ని రాష్ట్ర ప్రభుత్వం పై వేసిందన్నారు. కేంద్రంకు ఏవైనా ప్రతిపాదనలుంటే ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించుకోవాలని తమ ప్రభుత్వం అభివృద్ధి కోసం కావలసిన అనుమతులిచ్చేందుకు ఎప్పుడు సిద్దంగా ఉంటుందన్నారు.








## శారీలో శ్రద్ధాదాస్ అందాలు

చీరకట్టులో హీరోయిన్ శ్రద్ధా దాస్ మంత్రముగ్ధులను చేసింది. గ్లామరస్ హీరోయిన్ శ్రద్ధా దాస్ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్ గా ఉంటారో తెలిసిందే. తాజాగా తన అభిమానులతో పంచుకుంది. ఇంట్రెస్టింగ్ గా ఫొటోషూట్లు చేస్తూ అదరగొడుతోంది. సంప్రదాయ లుక్ లో మెరిసినా అందాల ప్రదర్శనతో మతులు పోగొడుతోంది. ఈ ముద్దుగుమ్మ నయా లుక్ లో మెరిసిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.